

వన్యప్రాణుల మృత్యు ఘోష

పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలోని వండవ–తూడి కొండల్లో వన్యప్రాణుల మృత్యుఘోష వినిపిస్తోంది. - 18లో



వెండి తెరపై మన నటులు

రాజాం పరిసరాల్లో... స్థానిక నటీనటులతో.. కేవలం రూ.40లక్షల వ్యయంతో చిత్రీకరించిన సినిమా ఈ నెల 3న విడుదల కానుంది. - 18లో



జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పర్యటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జి.కాంతారావు బుధవారం జిల్లాలో పర్యటించారు. - 18లో

న్యూస్‌రీల్

22న వాహనాల వేలం

- డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పనిచేయని 21 వాహనాలను ఈ–వేలం ద్వారా విక్రయించనున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలకు సంబంధించి ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు వేలం పాల నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం ఏపీ ప్రభుత్వం ఈ–వేలం పోర్టర్ కొనుగోలు.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

రబీ సీజన్ రుణలక్ష్యం రూ.250 కోట్లు

- అన్నదాతకు రుణసహకారం
- డీసీసీబీ సీఈఓ కె.జనార్దన్



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ జనార్దన

రామభద్రపురం: రబీ సీజన్‌లో జిల్లాలోని అన్నదాతకు రూ.250 కోట్ల రుణ సహకారం అందజేస్తామని డీసీసీబీ సీఈఓ కె.జనార్దన్ తెలిపారు. రామభద్రపురంలోని కేంద్ర సహకార బ్యాంకును ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు సహకార సంఘాల ద్వారా రూ.60 కోట్ల రుణం అందజేశామని చెప్పారు. గొర్రెలు పెంపకందార్ల సహకార సంఘాలకు రూ.10 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. రుణ వసూళ్లు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గృహనిర్మాణదారులకు రూ.20 లక్షల వరకు రుణాలు అందజేస్తామన్నారు. ఇంటి తనఖా కింద 9 శాతం వడ్డీపై రూ.5 లక్షల వరకు రుణం ఇస్తామని చెప్పారు. సహకార బ్యాంకులలో డిపాజిట్‌లకు 8.25 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీజీఎం సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఏజీఎం బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గోగాడ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష

- 3,124 మందికి 34 మంది గైర్హాజరు

విజయనగరం అర్బన్: ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు చేపట్టే జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులుగా నిర్వహించే పరీక్ష గత నెల 24న ప్రారంభమైంది. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న 3,124 మందికి గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, డెంకాడ మండలం చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఒక్కోపూట 225 మంది విద్యార్థులు మించకుండా నిర్వహించిన పరీక్షకు 34 మంది గైర్హాజరయ్యారు.

వేగవంతంగా భూముల రీ సర్వే



బొబ్బిలిలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

బొబ్బిలి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా బొబ్బిలి డివిజన్‌లోని మండలాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సూర్యకుమారి ఆదేశించారు. బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శేషశైలజ ఆధ్వర్యంలో బొబ్బిలి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే వివరాలను మండలాలు, గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. మండలాల్లో జరిగే రీసర్వేను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆర్డీఓ శేషశైలజకు సూచించారు. సమావేశంలో కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ త్రివిక్రమరావు పాల్గొన్నారు.

తొలిరోజు 87.26 శాతం పింఛన్ల పంపిణీ



విజయనగరం లెంకవీధిలో దివ్యాంగురాలు సీతల్ శర్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుసుమ



విజయనగరంలో వృద్ధుడు అప్పలరాజుకు ఐరిస్ తీస్తున్న వలంటీర్ శ్రావణి

విజయనగరం అర్బన్:

వైఎస్సార్ పెన్షన్ కానుకల పంపిణీలో విజయనగరం జిల్లా 87.26 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. జిల్లాలోని 14 రకాల పెన్షన్‌లు 2,80,927 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా, నెలలో తొలిరోజు బుధవారం 2,45,142 మంది ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్ డబ్బులు అందజేశారని డీఆర్‌డీఏ పీడీ ఏ.కళ్యాణచక్రవర్తి తెలిపారు. 92 శాతం దాటి పంపిణీ చేసిన మండలాల్లో కొత్తవలస, నెల్లిమర్ల అర్బన్, 91 శాతం దాటి పంపిణీ చేసిన మండాలల్లో విజయనగరం అర్బన్ ఉందన్నారు.



పుచ్చలవీధిలో దివ్యాంగుడు యుగంధర్ నాయక్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉమా

పండిన ధాన్యం మొత్తం కొనుగోలు

- ఓర్వలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- వారం రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీల భర్తీ
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: రైతులు విక్రయానికి సిద్ధం చేసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టంచేశారు. జెడ్పీ చైర్మన్ అధ్యక్షతన జెడ్పీ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాల్లో ఉపాధిహామీ పథకం, వైద్యం, ప్రజారోగ్యం, విద్య, గృహనిర్మాణం, సమగ్ర శిక్ష, పంచాయతీ తదితర శాఖల లక్ష్యాలు, ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా రైతులకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు. కేవలం పది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమవుతున్నాయని చెప్పారు. రైతులు ఎంతో సంతృప్తిగా ఉండడాన్ని చూసి ఓర్వలేక, ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలన్న ఉద్దేశంతో కొందరు టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని కూడా పూర్తిగా కొనుగోలు చేస్తామని స్పష్టంచేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రెండు జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను వారం రోజుల్లో భర్తీ చేయాలన్నారు. పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు, వాటి వినియోగం, పాఠశాలల మ్యాపింగ్, నాడు–నేడు ఫేజ్–2 పనుల ప్రగతిపై చర్చించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలపై ఆరా తీశారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయంతో పాటు, పశు సంవర్ధకం, పట్టు తదితర వ్యవసాయ అనుబంధ శాఖలపై చర్చించారు. వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యకేంద్రం కింద ప్రతీ నియోజకవర్గానికి రెండో వాహనాన్ని మంజూరు చేసినట్టు వెల్లడించారు. జెడ్పీ రెండో వైస్ చైర్మన్ కొత్రజన్ని సింహాచలం అధ్యక్షతన 6వ స్థాయీ సంఘం, బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు శాంతకుమారి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించి, ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, ఉమ్మడి విజయనగరం జిల్లా అధికారులు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

- రామతీర్థంలో వేడుకగా సీతారాముల తిరుక్కల్యాణం
- కనుల పండువగా ఎదురు సన్నాహోమహోత్సవం



శతమానం భవతి...



రాములోరి కల్యాణ వేడుక

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. పవిత్ర భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారి తిరుక్కల్యాణోత్సవాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామునుంచే కల్యాణ మహోత్సవ సందడి ప్రారంభమైంది. ముందుగా రామకోనేరు పవిత్ర జలంతో ఆలయాన్ని శుద్ధిచేశారు. అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్ కుమార్ తదితరులు స్వామివారికి ప్రాతఃకాల అర్చన గావించి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు శ్రీమద్రామాయణపారాయణం, వేదపఠనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో గంటన్నర సమయం పాటు విశేష హోమాలను జరిపించారు. సాయంత్రం 5గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠాపన, బలిహరణం నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం చేపట్టి సమస్త దేవతామూర్తులను స్వామివారి కల్యాణానికి ఆహ్వానించారు. మంగళ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణ నడుమ సీతారామలక్ష్మణులను పట్టువస్త్రాలు, వివిధ రకాల స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు హంస, అశ్వ, గరుడ వాహనాలపై ఉత్సవ విగ్రహాలను రామతీర్థం పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి మూడువాహనాల సేవను జరిపించారు. ఈ ఊరేగింపులో భాగంగా సీతమ్మవారి వాహనం, శ్రీరాముడి వాహనాలు ఎదురుపడినపుడు అర్చకులు వేద మంత్రాలతో తిరుక్కల్యాణ విశిష్టతను భక్తజనులకు చాటిచెప్పారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకువచ్చి స్వామివారి వివాహమహోత్సవాన్ని ప్రారంభించారు. ఆచారంగా ఏకుల కుటుంబీకులు పట్టువస్త్రాలు, పూజా సామగ్రిని స్వామివారికి సమర్పించారు.



సీతారామస్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు దంపతులు

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం...

సీతా సమేత రామస్వామి వారిని ఆస్థాన కల్యాణ మండపంలోనికి వేంచింపజేసి ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం గావించి అనంతరం గణపతి పూజను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకస్వాముల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సీతమ్మవారి శిరస్సుపైన జీలకర్ర బెల్లం పెట్టించి సీతారాముల తిరుక్కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపించారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాములోరి కల్యాణాన్ని కనులారా తిలకించారు. రామ క్షేత్రమంతా భక్త పారవశ్యంతో పులకించిపోయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు దంపతులు స్వామివారిని దర్శించి పూజాసామగ్రి అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ విజయనాథ్, ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. భక్తులకు దేవస్థాన సిబ్బంది ఉచిత ప్రసాదాన్ని అందించారు.

మోదం.. ఖేదం!

- తెలుగు రాష్ట్రాల్లోని రెండు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాలకు తగ్గిన నిధులు
- భోగాపురం విమానాశ్రయానికి నిధుల ఊసేలేదు
- గిరిజన ప్రాంత ప్రజల అభివృద్ధికి సానుకూల ప్రకటనలు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కొందరికి మోదాన్ని కలిగించగా, మరికొందరికి నిరాశనే మిగిల్చింది. రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి కేంద్ర బడ్జెట్లో ప్రత్యేక నిధులేవీ కేటాయించలేదు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధుల ఊసే లేదు. ఉత్తరాంధ్ర లో వెనుకబాటు జిల్లాలైన విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు మొండిచేయి చూపించినట్లే అయ్యింది.

గిరిజన వర్సిటీకి అరకొర...

ఇక ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద రెండు తెలుగు రాష్ట్రాల్లో కేంద్రం ప్రకటించిన రెండు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాల్లో ఒకటి మన జిల్లాలో ఉంది. ప్రస్తుతం విజయనగరంలోని ఏయూ పీజీ కాలేజీ భవనంలో తాత్కాలికంగా విశ్వవిద్యాలయం తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి శాశ్వత భవనాల నిర్మాణం కోసం మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 561.88 ఎకరాలను సేకరించింది. అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు, రైతులకు నష్టపరిహారం చెల్లింపునకు రూ.430 కోట్లు మంజూరు చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న రెండు యూనివర్సిటీలకు కలిపి గత బడ్జెట్ (2022–23)లో రూ.43.75 కోట్లు కేటాయించింది. ఈ బడ్జెట్ (2023–24)లో పెంచాల్సిందిపోయి కోత విధించింది. కేవలం రూ.35.67 కోట్లతోనే సరిపెట్టింది.

చిరుధాన్యాలకు ప్రోత్సాహం...

ఉమ్మడి విజయన గరం జిల్లా లో చిరుధాన్యాల సాగువిస్తీర్ణం ఎక్కువగా ఉంది. వీటి సాగువైపు రైతులను మరింత ప్రోత్సహించేలా 'శ్రీ అన్న' కార్యక్రమాన్ని కేంద్ర బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రకటించారు. చిరుధాన్యాలపై పరిశోధనలను విస్తృతం చేయడానికి వీలుగా హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్‌కు మద్దతు ఇవ్వనుంది.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి...

గిరిజన ప్రాంతాల్లో ప్రజలు సికిల్ సెల్ అనీమియా దీర్ఘకాలంగా బాధపడుతున్నారు. వారికి తగిన వైద్యం అందించడమే గాక రోగులకు రూ.10 వేల చొప్పున ప్రతినెలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పుడు ఆ మహమ్మారిని పూర్తిగా పారదోలే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన మిషన్‌ను ప్రకటించింది.

గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా...

పార్వతీపురం మన్యం జిల్లాలో ఆదివాసీలు (పీవీటీజీ) ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో 'ప్రధానమంత్రి పీవీటీజీ డెవలప్‌మెంట్ మిషన్'ను ప్రకటించడం శుభసూచకం. అలాగే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో టీచర్లను రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేయడానికి కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించడం నిరుద్యోగులకు కలిసివచ్చే అంశం. భామిని, గుమ్మ లక్ష్మీపురం, కురుపాం, అనసభద్ర, కొటికపెంటలో ఉన్న ఈ స్కూళ్లలో పోస్టులు భర్తీ కానున్నాయి.

ఆట ఆరంభం

- జేఎన్‌టీయూ జీవీ వేదికగా ప్రారంభమైన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ
- బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పోటీల్లో తలపడుతున్న 21 కళాశాలలకు చెందిన జట్లు
- విజేతలకు ఈ నెల 6న బహుమతి ప్రదానోత్సవం
- ప్రతిభను చాటుకునేందుకు చక్కని వేదిక ఎస్‌పీఎల్: జెడ్పీ చైర్మన్



కికెట్ మ్యాచ్‌కు టాస్ వేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బ్యాటింగ్‌తో ఆటను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఆరు రోజులు.. 21 జట్లు.. 315 మంది క్రీడాకారులు.. పదుల సంఖ్యలో మ్యాచ్‌లతో యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తోన్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ప్రాంగణంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు మొదటి మ్యాచ్ ఆడే లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్– సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలల జట్ల కెప్టెన్‌ల సమక్షంలో టాస్ వేసిన అనంతరం మజ్జి శ్రీనివాసరావు బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్తేజాన్ని నింపారు. అంతకు ముందు ఆయన పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పి ఉత్సాహపరిచారు. పోటీల్లో మొత్తం 21 కళాశాలలకు చెందిన జట్లు తలపడుతుండగా.. అందులో సీనియర్స్ విభాగంలో 15 జట్లు, జూనియర్స్ విభాగంలో 6 జట్లు తలపడనున్నాయి. 10 ఓవర్ల ఇన్నింగ్స్‌కు నిర్వహిస్తున్న మ్యాచ్ పూర్తిగా నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్టు 'సాక్షి' శ్రీకాకుళం యూనిట్ బ్రాంచి మేనేజర్ బీజేజీవీఆర్ స్వామి తెలిపారు. ఆరు రోజుల పాటు జరిగే మ్యాచ్‌లలో విజేతలకు చివరి రోజు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ట్రోఫీలు ప్రదానం చేస్తామన్నారు.

ప్రతిభను చాటుకునేందుకు చక్కని వేదిక ఎస్‌పీఎల్

క్రికెట్ క్రీడలో రాణించాలన్న తపన, యువతలో దాగి ఉన్న ప్రతిభను చాటుకునేందుకు సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు చక్కని వేదికగా నిలుస్తాయని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ క్రీడా ప్రాంగణంలో పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్న సాక్షి మేనేజింగ్ డైరెక్టర్ వై.ఎస్.భారతీరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గత కొన్నేళ్లుగా సాక్షి యాజమాన్యం ఎస్‌పీఎల్ పోటీలు నిర్వహిస్తూ యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించడం శుభపరిణామంగా పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో 21 జట్లు పోటీ పడుతుండగా... అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జట్లు విశాఖలో జరిగే రీజనల్ స్థాయి పోటీలకు, అక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విద్యలనగరం కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వర్సిటీ ఆర్అండ్‌డీ డైరెక్టర్ (అడ్మిషన్స్), ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.బాబులు, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సిరికుమార్, డీఈ కె.శ్రీనివాసరావు, ఏఈ ఎల్.హరిప్రకాష్, విజయనగరం బ్యూరో ఇన్‌చార్జి అల్లు సూరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జి పీసీహెచ్ అప్పలనాయుడు, యాడ్ మేనేజర్ ఆర్.నగేష్, యాడ్స్ విభాగ సిబ్బంది పి.శంకర్, ఎస్.కోటేశ్వరరావు, మురళి, గోవింద్, కళాశాల పీడీ యల్లారీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



లెండి ఇంజినీరింగ్- సత్య పీజీ కళాశాల మధ్య మ్యాచ్

టాస్ గెలిచి తొలి విజయం సాధించిన లెండి..



లెండి కళాశాల జట్టు విజయానందం

ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీలో భాగంగా లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్– సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన లెండి కళాశాల జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ప్రారంభించిన లెండి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 110 పరుగులు చేయగా... అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు 60 పరుగులకే ఆలౌటైంది. దీంతో 50 పరుగుల తేడాతో లెండి ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది.

2 వికెట్ల తేడాతో అవంతి జట్టు విజయం



గాయత్రీ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించిన అవంతి జట్టు

అవంతి ఇంజినీరింగ్ కళాశాల–గాయత్రీ డిగ్రీ కళాశాలల జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అవంతి జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన అవంతి జట్టు ముందుగా గాయత్రీ జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించగా... నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 76 పరుగులు చేశారు. అనంతరం 77 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన అవంతి జట్టు 9.1 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 80 పరుగులు జోడించి విజయాన్ని నమోదు చేసుకుంది.

క్లుప్తంగా

ఇసుకట్రాక్టర్ పట్టివేత


పినపెంకి జంక్షన్ వద్ద పట్టుకున్న ట్రాక్టర్

బాడంగి: మండలంలోని పినపెంకి వద్ద గలవేగావతినదిలోనుంచి అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక ఎస్సై జయంతి బుధవారం మాటువేసి పట్టుకున్నారు. మెరకముడిదాం మండలం బుదరాయవలసకు చెందిన మాడుగుల గౌరి పినపెంకినుంచి ఆకులకట్ట వైపు ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను ఇసుకతో సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌వద్ద భద్రపరిచామని తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

ఇద్దరు ముద్దాయిలకు ఏడాది జైలు శిక్ష

బొబ్బిలి: పేకాట ఆడుతూ పట్టు బడి పోలీసులపై దాడిచేసిన ఘటనలో ఇద్దరు ముద్దాయిలకు ఏడాది పాటు జైలు శిక్ష, రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ పీజేఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎం సరోజమ్మ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గున్నతోటవలస మామిడితోటలో 17వ తేదీ నవంబర్ 2019లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా బొబ్బిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది దాడిచేశారు. దీంతో పేకాట ఆడుతున్న వారిలో పారాది గ్రామానికి చెందిన కలిశెట్టి శశిభూషణరావు, బొబ్బిలి పట్టణంలోని కోరాడ వీధికి చెందిన రవ్వ శ్రీనుబాబులు కానిస్టేబుల్ మండంగి సూరయ్యపై దాడి చేశారు. దీంతో అప్పట్లో ఆ ఇద్దరు నిందితులపై కేసునమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు పై విధంగా శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు.

జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పర్యటన


కస్పా హైస్కూల్ మధ్యాహ్న భోజనశాల స్టోర్ రూంను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు బుధవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, చౌక ధరల దుకాణాలు, దాసన్నపేటలోని పౌరసరఫరాల గిడ్డంగి, కస్పా స్కూల్‌లో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. పట్టణంలోని నాగోజీపేట 511 అంగన్వాడీ కేంద్రంలో 5 గురు పిల్లలు మాత్రమే నమోదై ఉండగా గత ఐదు రోజుల్లో హాజరు పట్టికలో ఖాళీగా ఉండడాన్ని పరిశీలించి ఎందుకు హాజరు వేయలేదని ప్రశ్నించారు. పిల్లల హాజరు కాలేదని కార్యకర్త చెప్పగా ఆబ్సెంట్ వేయాలి కదా అన్నారు. అశ్రద్ధగా విధులు నిర్వహిస్తున్నారని చర్యలు తీసుకోవాలని పీడీ శాంతకుమారికి సూచించారు. కస్పా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పిల్లల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉడికించిన గుడ్డు, బంగాళదుంప కూర, వేరుశనగ చిక్కీ, వెజిటబుల్ రైస్‌ను పిల్లలకు వడ్డించారు. విద్యార్థుల హాజరు 50 శాతం కన్నా తక్కువగా ఉందని, పిల్లల్ని రప్పించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్‌లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌తో పోల్చి 200 కేజీల బియ్యం తక్కువగా ఉన్నాయని గుర్తించి అందుకు గల కారణం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సరైన వివరణ సమర్పించాలని ఆదేశించారు.

ఇకపై ప్రతి నెలా తనిఖీ

పౌరసరఫరాల గిడ్డంగిలో స్టాక్ వెరిఫికేషన్ చేశారు. రైస్, దాల్, ఆయిల్ నిల్వలను తనిఖీ చేశారు. సీజ్ చేసిన బస్తాలను తనిఖీ చేశారు. హమాలీలతో మాట్లాడి ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల 10వ తేదీలోగా వేతనాలు చెల్లిస్తున్నారని హమాలీలు చెప్పారు. రికార్డులన్నీ అప్‌డేటెడ్‌గా ఉంచాలని ఇకపై ప్రతి నెల వస్తానన్నారు. ఆయన వెంట లీగల్ మెట్రాలజీ, పౌ రసరఫరాలు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం..!



కేంద్రప్రభుత్వం బుధవారం 2023-2024 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లా వాసుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగులకు పన్నురాయితీ రూ.7 లక్షల వరకు పరిమితి పెంచడంతో సంతోషం వ్యక్తమవుతుండగా..రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు లేకపోవడంతో అసంతృప్తి తెలియజేస్తున్నారు. అలాగే పంటల సాగుకు ప్రోత్సాహం ఇవ్వడంతో రైతుల నుంచి హర్షం వ్యక్తమవుతుండగా...ధరల భారం తగ్గకపోవడంతో సామాన్యుల నుంచి నిరాశ పెల్లుబుకుతోంది. ఉమ్మడి జిల్లా ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలిలా ఉన్నాయి.

- సాక్షి నెట్‌వర్క్

అన్నివర్గాలకు ఉపయోగపడేలా బడ్జెట్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగపడేలా ఉంది. మరోవైపు ఎన్నికల బడ్జెట్‌గా కూడా కనబడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నైపుణ్య శిక్షణ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలపడం అభినందనీయం. ఏపీ సెంట్రల్ యూనివర్సిటీకి రూ.47 కోట్లు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.653 కోట్లు కేటాయించడం శుభపరిణామం. వ్యవసాయం, మౌలిక వసతుల రంగానికి పెద్దపీట వేశారు. అయితే రాష్ట్రానికి సంబంధించి విభజన చట్టంలోని హామీల విషయం కానీ, ప్రత్యేక హోదా గురించి ప్రస్తావించకపోవడం, రైల్వే కారిడార్‌పై ఎలాంటి హామీ ప్రస్తావన లేకపోవడం సరికాదు.

– డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పోలవరం, ప్రత్యేక హోదాపై ప్రశ్నిస్తాం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో అవసరమైన పోలవరం ప్రాజెక్టుకు నిధులతో బాటు ప్రత్యేక హోదాలో అంశాలపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం నిరాశ పరిచింది. అందుకనే పార్లమెంటు సమావేశాల్లో పోలవరం, ప్రత్యేక హోదాపై ప్రశ్నిస్తాం. ప్రస్తుత బడ్జెట్ ఎన్నికల బడ్జెట్‌ను తలపిస్తోంది. ఆదాయ పన్ను పరిమితి పెంపు, చిన్న పరిశ్రమలకు రాయితీలు వంటి అంశాలు మధ్యతరగతి ప్రజలకు ఊరటనిస్తుంది. మిల్లెట్ మిషన్‌కు నిధుల కేటాయింపు ఆహ్వానించదగ్గ విషయమే. అయితే ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో మిల్లెట్ల సాగు చాలా బాగుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చొరవతో మిల్లెట్ల సాగులో ఏపీ దేశ వ్యాప్తంగా నాల్గవ స్థానంలో ఉంది.

– బెల్లాన చంద్రశేఖర్, ఎంపీ, విజయనగరం

ప్రత్యేక నిధుల కేటాయింపు లేదు



కొత్తగా ఏర్పడిన మన రాష్ట్రానికి నిధుల కేటాయింపులో ఈ ఏడాది కూడా ప్రత్యేకత లేదు. వైద్య, ఆరోగ్య రంగాల్లో మెరుగైన సేవలకు అవసరమైన మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కాలేజీల ఏర్పాటుకు కేటాయింపులు బాగున్నాయి. దేశవ్యాప్తంగా 157 కొత్త నర్సింగ్ కాలేజీల ఏర్పాటు హర్షణీయం. పోర్టు విస్తరణ చర్యలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వడం అభివృద్ధికి శుభసూచకం.


కురిమినేని అప్పలనాయుడు, ఆర్థిక విశ్లేషకుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, విజయనగరం

వేతన జీవులకు ఊరట

బడ్జెట్-2023-24లో ఆదాయపు పన్ను సవరణ విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొంత ఊరట నిచ్చింది. ప్రస్తుతం రూ.5 లక్షల వరకు ఉన్న ఆదాయ పరిమితి రూ.7 లక్షలకు పెంచారు. శ్లాబ్‌లు 6 వరకు ఉండగా వాటిని ఐదుకు కుదించారు. పెరుగుతున్న ధరలను భరించలేని పరిస్థితిలో ఈ చర్యలు సమర్థనీయం.

డి.శ్యామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్‌టీయూ

సామాన్యులకు ఒరిగిందేమీలేదు.



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు ఊరట లభించింది. వార్షిక ఆదాయం రూ.7లక్షల వరకు పన్ను రాయితీ కల్పించడం మంచిదే. అయితే సామాన్యులపై ధరాభారం తగ్గించకపోవడం శోచనీయం. ఆంధ్ర అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతి, రైల్వే, విభజన హామీలకు మొండిచేయి చూపించారు.

నల్ల శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, పార్వతీపురం మన్యం జిల్లా

చిరుధాన్యాల ఉత్పత్తి విస్తరణకు ప్రాధాన్యం



ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులకు బడ్జెట్‌లో ప్రాధ్యాన్యం లభించింది. వ్యవసాయ రంగంలో చిరుధాన్యాల ఉత్పత్తి విస్తరణకు ప్రోత్సాహకాలు కేటాయించారు. ఇప్పటికే జొన్న, రాగి, బార్లీ ఇలా ఎన్నో చిరుధాన్యాల ఎగుమతిలో దేశం అగ్రస్థానంలో ఉంది. అత్యంత విలువ కలిగిన ఉద్యాన పంటలకు చేయూత ఇవ్వడం మంచి పరిణామం. –కొరుపోలు సత్యారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్, హ్యూమన్ రైట్స్ సంస్థ

వేతనజీవులకు ఆనందమే



కేంద్ర బడ్జెట్‌లో రూ.7లక్షల వరకు వార్షిక ఆదాయంపై పన్నురాయితీ అందించడం ఆనందం. గడిచిన నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న వేతన జీవులకు ఈ విధానంతో ఊరట లభించింది. లక్షలాది మంది ఉద్యోగులపై భారం తగ్గించడం హర్షణీయం.

లిల్లీ పుష్పనాథం, ఏపీఎన్‌జీవో, పాలకొండ డివిజన్ అధ్యక్షుడు

సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట



బొండపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రధానంగా సేంద్రియ వ్యవసాయం సాగుకు పెద్ద పీట వేసింది. ఇది మంచి పరిణామం. అలాగే రాష్ట్రానికి సంబంధించి కూడా ఎరువులు కేటాయింపులతో పాటు సబ్సిడీ ఎరువుల కేటాయింపులను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం వల్ల రైతులకు మేలు కలగనుంది. దీని వల్ల రైతులు మరింతగా పంటల సాగుకు ముందుకు రావడానికి అవకాశం ఉంటుంది.

మహంతి రమణ, పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్, గొట్లాం

ప్రజారంజక బడ్జెట్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మధ్యతరగతి కుటుంబాలు, యువతకు పెద్దపీట వేశారు. నిర్మాణ రంగానికి మంచి ప్రోత్సాహం ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో ఆదాయ పన్ను రాయితీలు అద్భుతంగా ఉన్నాయి. ఈ రాయితీలవల్ల మధ్య తరగతి కుటుంబాలకు మేలు చేకూరుతుంది. బడ్జెట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల యువతకు ఉపాధి కల్పనతో భరోసా కలుగుతుంది. స్వదేశీ ఉత్పత్తి పెంచడానికి స్వదేశీ మాల్స్ ఏర్పాటుచేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

సీహెచ్‌ఆర్‌కె ప్రసాద్, వివేకానంద విద్యాసంస్థల అధినేత, శృంగవరపుకోట

బొల్లినేనిలో నూతన కోర్సులు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో యువతకు ఉపాధి కల్పించే నూతన కోర్సులు ఫార్మసీ అసిస్టెంట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసెస్ అసోసియేట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తి చేసిన వారు, పదో తరగతి పాస్/ఫెయిలైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 75 రోజుల శిక్షణ కాలం పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు బ్యాంకింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 అనే నంబర్లను సంప్రదించాలన్నారు.

గోధుమ పిండి పంపిణీ ప్రారంభం


గోధుమ పిండి పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్

పార్వతీపురంటౌన్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మున్సిపాలిటీలలో అర్హులైన పేదలకు గోధుమపిండి పంపిణీ ప్రారంభమైంది. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ బుధవారం స్థానిక నాయుడు వీధిలో గోధుమపిండి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆహార భద్రతకు గోధుమపిండిని ప్రభుత్వం పంపిణీ చేస్తోందని చెప్పారు. రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు రెండు కేజీల గోధుమపిండిని కిలో రూ.16 చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 33,385 రేషన్ కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పార్వతీపురం మున్సిపాలిటీలో 11,827 రేషన్ కార్డులు, పాలకొండలో 7,868, సాలూరులో 13,690 కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమణా రావు హరి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు హితవు పలికారు. స్థానిక ఫోర్ ఎస్ కళాశాలలో విద్యార్థులు-మాదక ద్రవ్యాల వినియోగం అన్న అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి జిల్లాలో జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ వారి సూచనలతో సమీక్ష సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిల్లలు, విద్యార్థుల్లో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం నిలవరించడంలో జిల్లాలోని అన్ని శాఖల సమన్వయం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. పాఠశాలలు, వివిధ హాస్టల్స్ సమీపంలో మద్యం దుకాణాలు, బార్లు లేకుండా ఎక్సైజ్, పోలీస్, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ జి. హిమబిందు, సభ్యులు భవాని, సుధారాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, యాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

- ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్


నిరసన తెలుపుతున్న దుడ్డుఖల్లు గ్రామస్తులు, గిరిజన సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం:

విచారణ పేరుతో గిరిజనుడైన కొండగొర్రి కామరాజును తీవ్రంగా కొట్టి ఆస్పత్రి పాలు చేసిన ఎల్విన్‌పేట పోలీసులతో పాటు కామరాజుపై దొంగతనం నేరం మోపిన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్‌పై చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలని దుడ్డుఖల్లు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజన సంఘాల నాయకులు నిమ్మక సింహాచలం, పువ్వల తిరుపతిరావు, కోలక అవినాష్, మండంగి రమణ, శ్రీను, గంగునాయుడు, సీతారాం తదితరులతో కలిసి బాధితుడు కామరాజు కుటుంబీకులు, గ్రామస్తులు బుధవారం గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామరాజు, అతని భార్య పార్వతి ఆశ్రమ పాఠశాలలో పనిచేసేందుకు రోజుకు రూ.150 కూలి కోసం వార్డెన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని, వారితో సుమారు మూడేళ్లు పనిచేయించుకున్నప్పటికీ కూలి సొమ్ము చెల్లించలేదన్నారు. దీంతో వారు పనికి వెళ్లడం మానేసి, తమకు బకాయి పడిన కూలి ఇవ్వాలని అడగడంతో డబ్బులివ్వకుండా..ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న జనరేటర్‌ను దొంగతనం చేశాడంటూ ఎల్విన్‌పేట పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు కామరాజును విచారణ కోసమని పోలీస్‌స్టేషన్‌ను పిలిపించి తీవ్రంగా కొట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురైన కామరాజును 108 అంబులెన్స్‌లో తరలించి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చేర్పామన్నారు. సమగ్ర విచారణ జరపకుండా కామరాజును తీవ్రంగా కొట్టిన పోలీసులతో పాటు కూలి సొమ్ము చెల్లించకుండా తప్పుడు నేరారోపణ చేసిన డిప్యూటీ వార్డెన్‌పై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జె.రాములమ్మతో పాటు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి

- డీజీఎం దాలినాయుడు


బాధ్యతలు స్వీకరించిన డీజీఎంను సత్కరిస్తున్న బీఎస్‌ఎన్‌ఎల్ ఈయూ నాయకులు

విజయనగరం టౌన్: బీఎస్‌ఎన్‌ఎల్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల అభ్యున్నతికి పూర్తిస్థాయిలో కృషిచేస్తానని డిప్యూటీ జనరల్ మేనేజర్ దోసూరి దాలినాయుడు పేర్కొన్నారు. డీజీఎంగా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు డీజీఎంను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఆలుగు వెంకటరావు, కోశాధికారి తామాడ కృష్ణకుమారి, కార్యదర్శి వైహెచ్ఎస్.పాపారావు, ప్రతినిధులు రవిరాజు, భాను, శకుంతల, రేవెళ్ల రమణమ్మ, లక్ష్మణకుమార్, తులసి, ఎం.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

గరివిడి(చీపురుపల్లి రూరల్): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో మరణించినట్లు రైల్వే ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని, నలుపు రంగు చొక్కా ధరించాడని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ 7013273731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వన్యప్రాణుల మృత్యు ఘోష

- వండవ-తూడి కొండల్లో మూగజీవాలు విలవిల
- కుక్కల దాడిలో కొన్ని, వేటగాళ్ల తూటాలకు మరికొన్ని బలి


వన్యప్రాణులకు నిలయమైన వండవ కొండ


కుక్కల దాడిలో మృతి చెందిన గర్భందాల్చిన జింకకు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ సిద్ధార్థ్

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలోని వండవ-తూడి కొండల్లో వన్యప్రాణుల మృత్యుఘోష వినిపిస్తోంది. కొన్ని నెలలుగా వేటగాళ్ల తూటాలకు జింకలు, దుప్పిలు, అడవి పందులు బలవుతుండగా, కుక్కల దాడిలో మరికొన్ని ప్రాణాలు విడుస్తున్నాయి. తాజాగా బుధవారం తెల్లవారుజామున కుక్కల దాడిలో ఒక గర్భందాల్చిన జింక మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. దాహార్తిని తీర్చుకునేందుకు వండవ గ్రామ సమీపంలోకి వచ్చిన జింకపై కుక్కల గుంపు దాడిచేసి హతమార్చాయి. స్థానికులు కుక్కల గుంపును చెదరగొట్టి జింకను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గర్భంనుంచి జారిపోతున్న జింక పిల్లను చూసి స్థానికులు కన్నీరుకార్చారు. కాసేపటికే మృతిచెందిన తల్లీపిల్లలను అటవీశాఖ అధికారులు, వైద్యుల సమక్షంలో దహనం చేశారు.

వేటగాళ్లను తప్పించుకునే ప్రయత్నంలోనే...

తూడి-వండువ కొండలు సుమారు 150 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ కొండల్లో వేల సంఖ్యలో వన్యప్రాణులు సంచరిస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి వేటగాళ్ల ముఠా గుట్టుగా వన్యప్రాణులను నాటుతుపాకీలతో వేటాడం వల్లే మైదానం ప్రాంతంలోకి వచ్చి కుక్కల గుంపుకు జింక దొరికిపోయిందని స్థానికులు చెబుతున్నారు. అప్పుడప్పుడు దాహార్తి తీసుకునేందుకు గ్రామాల్లోకి కూడా వచ్చిన సందర్భాలు ఉన్నాయని, వేటగాళ్ల నుంచి తప్పించుకునే క్రమంలో కొన్నిసార్లు సమీపంలో ఉన్న సీఎస్పీ రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఈ కొండను వన్యప్రాణుల జోన్‌గా గుర్తించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై అటవీశాఖ వీరఘట్టం సెక్షన్ అధికారి రవికుమార్ మాట్లాడుతూ తూడి-వండవ కొండల్లో వేల సంఖ్యలో ఉన్న వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపడతామని చెప్పారు. వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కారు ఢీకొని యువతి మృతి

- తల్లిదండ్రులకు గాయాలు

డెంకాడ: మండలంలోని నాతవలస టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను కారు ఢీకొట్టడంతో యువతి ఉప్పాడ లావణ్య (17) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె తల్లిదండ్రులు మంగమ్మ, రమణ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై ఎస్సై మహేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. లావణ్య, తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని నిమ్మవానిపేటకు బైక్‌పై వస్తూ నాతవలస టోల్‌ప్లాజా వద్ద బైక్ పక్కకు తీసి ఆగారు. ఇంతలో అదేవైపు నుంచి వస్తున్న కారు ముందు వెళ్తున్న లారీని తప్పించి వచ్చి ఆగిఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో అక్కడే నిలబడిన లావణ్య, తల్లిదండ్రులు రమణ, మంగమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లావణ్య మరణించింది. తల్లిదండ్రులు మంగమ్మ, రమణలు చికిత్స పొందుతున్నారు. విశాఖలోని ఎంవీపీ కాలనీలో ఉంటూ రమణ తాపీపని చేస్తున్నాడు. సొంత గ్రామమైన నిమ్మవానిపేటలో శుభకార్యక్రమానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు కూడా పల్టీ కొట్టడంతో అందులో ఉన్న వారికి కూడా గాయాలైనట్టు ఎస్సై మహేష్ తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెండి తెరపై మన నటులు

- నేడు విడుదల కానున్న ఎట్ పాతాళ భైరవి
- పూర్తిగా రాజాం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ
- 1.58 గంటల నిడివితో సినిమా
- రూ. 40 లక్షలు పెట్టుబడితో రూపకల్పన

రాజాం: సినిమా అనగానే ఒకప్పుడు మద్రాస్ గుర్తుకొచ్చేది. అనంతరం హైదరాబాద్ కేంద్రంగా మారింది. విశాఖపట్నం కూడా ఒక అంతర్భాగం అయ్యింది. ఇప్పుడు మన గ్రామీణ ప్రాంతాలు సినిమాలు తీసేందుకు అనుకూలంగా మారాయి. నిన్న జయమ్మ పంచాయతీ రాజాం నియోజకవర్గ పరిధిలో చిన్నయ్యపేట గ్రామంలో చిత్రీ కరించారు. ఎక్కడెక్కడ నుంచో నటీనటులు వచ్చాయి. ఈ ప్రాంతానికి చెందిన ఒకరిద్దరికి అవకాశాలు కూడా వచ్చాయి. యాంకర్ సుమ నటించిన ఈ సినిమా బాగానే ఆడింది. ఇప్పుడు ఇదే కోవలో ఎట్ పాతాళ భైరవి తెరకెక్కింది. 90 శాతం సినిమా రాజాంతో పాటు పరిసర ప్రాంతాల్లో కెమెరాకు ఎక్కించారు. కేవలం 10 శాతం మాత్రమే దుబాయ్‌లో చిత్రీకరించారు. ఈ సినిమాలో 90 శాతం నటులు రాజాం పరిసర ప్రాంతాల్లోని వారు కావడం మరో విశేషం. కేవలం రూ.40 లక్షల బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ సినిమాకు రచయిత దివాకర్ తనయుడు శ్రీఖర్‌బాబు దర్శకత్వం వహించారు. బంకుపల్ల బరద్వాజ్, బిందుభైరవి, రాధాకృష్ణ తదితర హీరో, హీరోయిన్‌లతో పాటు మరికొద్దిమంది ఆర్టిస్టులు మాత్రమే ఇతర ప్రాంతాలకు చెందిన వారు. అరుణాచల శివ బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమాకు దగ్గుబాటి వరుణ్, సీహెచ్‌వీ అనంత్, కల్యాణబాషిణి, పీవీజీకే రాజులు ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు.

రాజాం ఎమ్మెల్యే ప్రత్యేక పాత్రలో..

గ్రామీణ ప్రాంతాల్లో జీవన వైవిధ్యం, ఆచార సంప్రదాయాలు, ఆధునిక మేళవింపు తదితర అంశాలతో తెరకెక్కిన సినిమాలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పలు అవార్డుల గ్రహీత గోకవలస కృష్ణమూర్తి, తృప్తిరిసార్ట్ యజమాని మురళీమాస్టరు వంటివారు నటించారు. పట్టువర్ధనం, బాగేంపేట, గుల్లసీతారాంపురం, మెరకముడిదాం, పెరుమాళి ప్రాంతాలకు చెందిన వారికి సినిమాలో నటించే అవకాశం దక్కింది. 1.58 గంటల నిడివి ఉన్న ఈ సినిమాను 50 రోజుల వ్యవధిలో పూర్తి చేశారు. రాజాంలోని సీతారామ థియేటర్‌లో ఈ నెల 3 నుంచి సినిమా ప్రదర్శితంకానుంది.


గుల్లసీతారాంపురం ఆలయం వద్ద స్థానిక నటులతో సన్నివేశం


సినిమా షూటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కంబాల జోగులుతో సన్నివేశం